www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024
5
ఏలూరు



వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్‌డిఒ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు/కైకలూరు

భారీ వర్షాలు, వరదలు వల్ల కైకలూరు నియోజకవర్గంలో ఉన్న కొల్లేరు సరస్సులో వరదనీరు కలవడంతో కొల్లేటికోట, పెంచికలమర్రు, కొల్లేటికోట, వడ్లకుట్టిప్ప, ఆలపాడు తదితర గ్రామాల్లోని వరద నీరు ప్రవాహంతో కాలువలను ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతూ తమ్మిలేరు వరదనీరు విడుదల కావడంవల్ల ఆ కాల్వగుండా వెళ్లే గ్రామాల్లో క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ వంటి అతిముఖ్యమైన అంశాలపై సిబ్బంది దృష్టి సారించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌డిఒతో పాటు తహశీల్దార్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇళ్లు కూలే.. పంట పొలాలు పోయే..!



'నాపేరు కుంజె ధర్మయ్య, వేలేరుపాడు మండలం అల్లూరి నగర్. పెదవాగు ప్రాజెక్టు గండిపడి నీరు ఊళ్లపై పడఌంతో గతంలో ప్రభుత్వం ఇచ్చిన కాలనీ ఇళ్లు మొత్తం కొట్టుకుపోయాయి. శ్లాబు దూరంగా వెళ్లి పడిపోయింది. షెడ్డు కూడా కొట్టుకుపోయింది. నలుగురు కుటుంబ సభ్యులం పక్క ఇంట్లో తలదాచుకుంటున్నాం. టార్ఫిన్లు ఇస్తే తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం. కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాం'



'నా పేరు మందోటి ఏసుబాబు, కోయమాధవరం. ఆరెకరాల్లో మిర్చి నారు, నాలుగెకరాల్లో పత్తి దెబ్బతింది. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లింది. పొలాల్లో ఇసుక మేటలు వేసింది. ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ఇక ఈ ఏడాదికి సాగులేనట్లే.. పొలాల్లో ఇసుక మేటలు తేరడంతో సాగుకు పనికి వచ్చే పరిస్థితి కనపడం లేదు. ఇళ్లు కూలిపోయి, పంటపొలాలు దెబ్బతిన్నాయి. కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం. ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని కోరుతున్నాం'



కోయమాధవరం బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

వేలేరుపాడు మండలం
పెదవాగు ప్రాజెక్టు బాధితుల అరణ్యరోదన
కట్టుబట్టలతో రోడ్డున పడ్డామంటూ కన్నీరుమున్నీరు
టార్ఫిన్లు సైతం ఇవ్వకపోవడంపై ఆవేదన
వంట పాత్రలు, గ్యాస్ బండ ఇవ్వాలంటూ వేడుకోలు
సిపిఎం బృందం వద్ద బాధితులు కష్టాలు ఏకరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం టౌన్

వేలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రాజెక్టు బాధిత గ్రామాల్లో ఎవరిని కదిపినా ఇలాంటి హృదయ విదారకర ఘటనలే కనిపిస్తున్నాయి. ఇళ్లు కూలిపోయాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు వేసి నారుమడులన్నీ ధ్వంసమయ్యాయి. పొలాలు సాగుకు పనికిరాకుండా పోయాయి. కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం.. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలంటూ' బాధితులు పెడుతున్న ఆర్తనాదాలు అందరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. పెదవాగు ప్రాజెక్టుకు గండిపడడంతో ముంపునకు గురైన గ్రామాల్లో ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం పర్యటించింది. అల్లూరినగర్, కోయమాధవరం, మద్దిగూడెంలో పర్యటించిన సిపిఎం నాయకులకు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఒక్క రాత్రితో తమ పరిస్థితి తారుమారైపోయిందంటూ కన్నీరుమున్నీరయ్యారు. ఇళ్లు, ఇంట్లో సామాన్లు కొట్టుకుపోయాయి. వరి, మిర్చి, పత్తి నారుమడులు మొత్తం దెబ్బతిన్నాయి. దాదాపు 4 వేలకు పైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అక్కడి రైతులు తెలిపారు. ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టిన పెట్టుబడులు గంగలో కలిసిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రం దూరంగా ఏర్పాటు చేయడంతో అక్కడకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అల్లూరి నగర్‌లో 85 ఇళ్లు ఉండగా 45 ఇళ్లు కొట్టుకుపోయాయి.



వరదకు పూర్తిగా దెబ్బతిన్న అరటి పంట

దెబ్బతిన్న మిగిలిన ఇళ్లలోనే అంతా తలదాచుకుంటున్నాం. ఒక్కో ఇంటికి కనీసం లెక్కించినా రూ.నాలుగు నుంచి రూ.ఐదు లక్షలు నష్ట పోయామంటూ బాధితులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధితుల సమస్యలను మండల, జిల్లా, రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు, ప్రభుత్వంలో పెద్దలకు, వివరించి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామంటూ సిపిఎం నాయకుల భరోసా ఇచ్చారు. అధికారులు భోజనం మాత్రం అందిచగలుగుతున్నారని, తమకు కావాల్సిన వంటపాత్రలు, గ్యాస్ బండలు, నిత్యావసర వస్తువులు ఇస్తే తాము వంట చేసుకుంటామంటూ బాధితులు కోరుతున్న పరిస్థితి నెలకొంది. అందరూ కలిసికట్టుగా పోరాడదామంటూ బాధితులకు సిపిఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు, జిల్లా నాయకులు డిఎన్‌విడి ప్రసాద్, తెల్లం రామకృష్ణం, తెల్లం దుర్గారావు, మొడియం నాగమణి. మడివి దుర్గారావు, ధర్ముల రమేష్, యర్రంశెట్టి నాగేంద్రరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టార్ఫిన్లు ఇస్తే తాత్కలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం

ఇళ్లు కొట్టుకుపోవడంతో నిలువ నీడలేకుండా పోయింది. పక్కా ఇళ్లలో తలదాచుకుంటున్నాం. టార్ఫిన్లు ఇస్తే తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుంటాం. కూలిపోయిన ఇళ్ల ప్రాంతంలో ప్రభుత్వం పక్క ఇళ్లు నిర్మించాలని బాధితులు కోరుతున్న పరిస్థితి నెలకొంది. సిపిఎం నాయకుల మాట్లాడుతూ బాధితులకు టార్ఫిన్లు వెంటనే అందించాలని, తక్షణ సాయం కింద రూ.పది వేలు అందించి, నష్టపరిహారం తేల్చి పరిహారం ఇవ్వాలన్నారు. బాధితులకు నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు, బట్టలు, ఇతర సామగ్రి అందిచాలన్నారు. దెబ్బతిన్న ప్రాజెక్టును వెంటనే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 15 గ్రామాల్లో తీవ్ర విపత్తు ఏర్పడిందన్నారు. అసెంబ్లీలో దీనిపై చర్చించాలన్నారు.



తమ్మిలేరు పరివాహక ప్రాంతాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

తమ్మిలేరు పరివాహక ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్, ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

తమ్మిలేరు వరద దృష్ట్యా ముందస్తు చర్యగా ఏలూరు రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలను ఆదివారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నగరంలోని తమ్మిలేరు పరివాహక ప్రాంతమైన సాయినగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఎంఆర్ నగర్, కొమడవోలు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పరివాహక ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తమ్మిలేరు వెంట ఉన్న గట్ల పటిష్టత గురించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాస్తవ పరిస్థితులను వారు ప్రత్యక్షంగా తెలుసుకుని అధికారులకు పలు ఆదేశాలు, సూచనలను జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులతో మాట్లాడుతూ 2019 మాదిరిగా వరదొస్తే అందుకు తగిన విధంగా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. గట్ల పటిష్టను పరిశీలించి బలహీనమైన చోట్ల అవసరమైన ఇసుక బస్తాలు, తదితర సామగ్రి సిద్ధంగా ఉండాలన్నారు. ఎక్కడైనా గండి కొట్టాల్సిన పరిస్థితి ఉంటే అందుకు అవసరమైన పొక్లయినర్ ముందుగానే అందుబాటులోకి తెచ్చుకోవాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతకాలనీ వాసులతో ముందుగానే మాట్లాడి, వరద హెచ్చరికలను అనుసరించి వారు సురక్షిత ప్రాంతాలకు తరలించే విషయంపై అవగాహన కలిగించాలన్నారు. అదేవిధంగా ఆటో ద్వారా మైక్ ద్వారా కూడా సమాచారం ముందుగానే తెలియజేయాలన్నారు. గతంలో తమ్మిలేరు వరదలను దృష్టిలో పెట్టుకొని చర్యలు చేపట్టాలని తెలిపారు. తమ్మిలేరు రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు ఇరిగేషన్ అధికారులు తెలుసుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ్మిలేరు కాలువకు సంబంధించి ఏలూరులో నాలుగు పాయింట్ల వద్ద సంబంధిత అధికారులు 24 గంటలూ పర్యవేక్షణలో ఉండాలని ఆదేశించారు. ప్రజలను అప్రమత్తం చేయడానికి ముందుగానే హెచ్చరికలను జారీ చేయాల్సిన బాధ్యత అధికారులపైఉందన్నారు. ఇరిగేషన్ ఇంజినీర్లతో పాటు నగరపాలక సంస్థ ఇంజినీర్లను ఆయా నాలుగు పాయింట్లలో పర్యవేక్షణకు ఉంచాలన్నారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ నాగిరెడ్డిగూడెం వద్ద తమ్మిలేరు వరద నీరు విడుదల ముందు రెవెన్యూ పోలీసు అధికారులతో పాటు ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే సమయంలో ఆటో ద్వారా మైక్‌లో వరద ప్రమాద హెచ్చరికలను ఆయా ప్రాంత వాసులకు తెలియజేయాలన్నారు. తమ్మిలేరు వరదకు సంబంధించి గతంలో సంభవించిన వరదలు, నీటి ప్రవాహాన్ని నిరోధించేందుకు గండ్లు ఏ ప్రాంతంలో చేసింది తదితర వివరాలను ఆయన ఆరా తీశారు. వారి వెంట ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె ఖాజావలీ, డిఎస్‌పి ఇ.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఇన్‌ఛార్జి ఎస్ఇ సిహెచ్ దేవప్రకాష్, డిఇ వై.అర్జునరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, ఏలూరు తహశీల్దార్ మురార్జి, ఎంహెచ్ఒ డా.మాలతి ఉన్నారు.

గోదా 'వర్రీ'

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 43 అడుగులకు చేరిన నీటిమట్టం
- దిగువకు 8.85 క్యూసెక్కుల నీరు విడుదల
- గంట గంటకూ ప్రమాదకరంగా పరిస్థితి
- వేలేరుపాడు, కుక్కునూరు మండలాలను చుట్టేస్తున్న వరద
- అప్రమత్తమైన అధికారులు
- నేడు ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఉధృతంగా ఉన్న గోదావరి

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద నీరు పోటెత్తుతోంది. గంట గంటకూ పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. ఆదివారం రాత్రికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీఅయ్యింది. దిగువకు 8.85 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం ఉదయానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులకు చేరనుందని రెండోప్రమాద హెచ్చరిక జారీ అయ్యే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో వేలేరుపాడు, కుక్కునూరు మండలాలను వరద నీరు చుట్టుముడుతోంది. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గోదావరి నదికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయినవెంటనే వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత గ్రామాల ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించే కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి జిల్లా కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకుమార్ లతో కలిసి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భద్రాచలం వద్ద గోదావరి వరద నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుందని, వరద నీటిమట్టం పెరుగుతున్న స్థాయిని అనుసరించి ఇరిగేషన్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయము చేసుకుని మిగిలిన ప్రాంతాలలో కూడా వరద కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వరద సహాయక కార్యక్రమాలు ప్రారంభించాలన్నారు. కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, లచ్చిగూడెం గ్రామాలకు కల్వర్టులు మునిగి రవాణా వ్యవస్థ స్తంభిస్తుందని, గొమ్ముగూడెం లోని 250 కుటుంబాలను దారాచారంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీకి, లచ్చిగూడెం గ్రామంలోని 47 కుటుంబాలను కొండపై ఉన్న ప్రాంతంలో వరద ఉధ్రితి తగ్గేవరకు తాత్కాలిక వసతి కల్పించాలన్నారు. వారికి మూడు రోజులకు సరిపోయే విధంగా బియ్యం, అరకేజీ కందిపప్పు, అరకేజీ వంటనూనె, వాటర్ ప్యాకెట్లు, 5 రకాల కూరగాయలు ప్రతీ కుటుంబానికి అందించాలన్నారు. అదేవిధంగా ఇటీవల పెదవాగు వరద కారణంగా దెబ్బతిన్న వేలేరుపాడు మండలంలోని దెబ్బతిన్న గ్రామాల ప్రజలకు ఆహారం, త్రాగునీరు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. వేలేరుపాడు మండలం అల్లూరినగర్‌లో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు 15 టార్పాలిన్లు అందించడం జరిగిందని, మిగిలిన గ్రామంలో కూడా ఇళ్లు దెబ్బతిన్న కుటుంబాలకు టార్పాలిన్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వరద సహాయక కార్యక్రమాల్లో ఎక్కడా ఏ విధమైన ఫిర్యాదులకూ తావులేకుండా బాధితులను ఆదుకునేలా అధికారులు పనిచేయాలన్నారు. వరద ముంపు ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మూడునెలల అడ్వాన్స్ రేషన్ సిద్ధంచేసినట్లు అధికారులు తెలిపారు. వేలేరుపాడు మండలంలో 2,606 క్వింటాళ్ల బియ్యం, 7,627 కిలోల కందిపప్పు, కుక్కునూరు మండలంలో 4,066 క్వింటాళ్ల బియ్యం, 12,193 క్వింటాళ్ల కందిపప్పు, ఆయా పునరావాస కేంద్రాల సమీపంలో నిల్వలు అందుబాటులో ఉంచామని, వంట నూనె స్టాక్ చేసినట్లు అదికారులు తెలిపారు.



భద్రాచలం వద్ద 43 అడుగులకు చేరిన నీటిమట్టం

పోలవరం:పోలవరంలో గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదులైన శబరి, మంజీర, ప్రవర, పర్ణ, ప్రాణహిత, ఇంద్రావతి, కిన్నెరసాని, మానేరు నీరు గోదావరిలోకి కలుస్తోంది. అయితే ఈ వరద నీటిని స్పిల్వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 8,57,707 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 32.900 మీటర్లు, స్పిల్వే దిగువన 23.320 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకట రమణ, మల్లికార్జునరావు తెలిపారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41.50 అడుగులకు చేరింది. గోదావరిలోకి ఎగువ ప్రాంతాల నుండి అదనపు జలాలు వస్తుండడంతో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 9 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్వేలోకి సోమవారం నాటికి మరో 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు గోదావరిలోకి రానున్నట్లు పది లక్షల క్యూసెక్కుల పరిధి దాటితే మొదటి హెచ్చరిక జారీ చేయడం జరుగుతుందని ధవళేశ్వరం బ్యారేజి డిఇఇ రమేశ్ తెలిపారు.

తమ్మిలేరు తగ్గుముఖం

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు రిజర్వాయర్ వద్ద వరద కొంచెం తగ్గుముఖం పట్టినట్లు ఇరిగేషన్ ఎఇ పరమానందం తెలిపారు. రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 355 అడుగులని, ప్రస్తుత నీటి మట్టం తమ్మిలేరు బేసిన్ 346.73 అడుగులని, గొనెలవాగు బేసిన్ 344.4 అడుగులు ఉన్నట్లు తెలిపారు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 3 టిఎంసిలు అని, ప్రస్తుత నీటి నిల్వ 1.485 టిఎంసి అని తెలిపారు. కాచ్ మెంట్ ఏరియాలో వర్షం, ఎగువ నుంచి వస్తున్న వరద 3,576 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు.

నేడు 'మీ కోసం' రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా ఈ నెల 22వ తేదీ సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ మీకోసం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆలాగే మండల, డివిజన్ స్థాయిలో జరగాల్సిన ప్రజా సమస్యలు పరిష్కార వ్యవస్థ (మీకోసం) రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారీ వర్షాల కారణంగా 22వ తేదీ సోమవారం ఏలూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు సెలవుగా ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం ఆదిఆవరం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సెలవును తదుపరి ఆదేశాల మేరకు రానున్న సెలవు రోజులో ఏదైనా ఒకరోజు పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.

వరద ముంపు ప్రాంతాల్లో రేషన్ సిద్ధం

వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు
6,672 క్వింటాళ్ల బియ్యం, 19,820 కేజీల కందిపప్పు సిద్ధం

ప్రజాశక్తి - ఏలూరు

వరద ముంపు బాధిత ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో మూడు నెలల అడ్వాన్స్ రేషన్‌ను సిద్ధం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఇప్పటికే జులై మాసం రేషన్ పంపిణీ చేయగా, రానున్న రెండు నెలలు కూడా వేలేరుపాడు మండలంలో 2,606 క్వింటాళ్ల బియ్యం, 7627 కేజీల కందిపప్పు, కుక్కునూరు మండలంలో 4,066 క్వింటాళ్ల బియ్యం, 12193 క్వింటాళ్ల కందిపప్పు, ఆయా పునరావాస కేంద్రాల సమీపంలో నిల్వలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అదేవిధంగా వంట నూనెను కూడా స్టాక్ చేశామని తెలిపారు. వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల భారీ వర్షాలకు గోదావరి నది పరివాహక ప్రాంతమైన వేలేరుపాడు మండలంలో ఉన్న పలు లోతట్టు ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందితో, పోలీస్ సిబ్బందితో రెవెన్యూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ప్రాణా నష్టం ఆస్తి నష్టం జరగకుండా ప్రత్యేకమైన పర్యవేక్షణను ఎస్‌పి కె.ప్రతాప్‌శివకిషోర్ నిర్వహించారన్నారు. ఆదివారం ఎస్‌పి వేలేరుపాడు మండలంలో పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు సురక్షత ప్రాంతాల్లో తలదాచుకోవాలని, నీటి ప్రవాహం తగ్గేంతవరకు ప్రవాహానికి ఎదురుగా వెళ్లకూడదని, మండలంలో లోతట్టు ప్రాంతాల్లో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బందిని మండలంలో పలు ప్రాంతాల్లో వారిని ఉంచామని, ఏదైనా ఆపద సమయంలో వారి సహాయ సహకారంతో ప్రజలకు సహాయం అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

వేలేరుపాడు, కుక్కునూరులో వైద్య శిబిరాలు ఏర్పాటు

గర్భిణులు, బాలింతలను ప్రభుత్వాసుపత్రికి తరలింపు

ఏలూరు :భారీ వర్షాలు, వరదలు కారణంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు వేలేరుపాడు మండలానికి చెందిన గర్భిణిని, కుక్కు నూరులోని ఇద్దరు బాలింత లను ప్రభుత్వాసు పత్రికి తరలించినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ట తెలి పారు. భారీ వర్షాలు, వరద ముంపు ప్రాంతాలైన గ్రా మాల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలిం చి వారికి అవసరమైన వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందించే ఏర్పాట్లను ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శర్మిష్ట పరిశీలించారు. వేలేరుపాడు మం డలం దాచారంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ పరిశీల నలో భాగంగా వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వరద బాధితులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పునరా వాస కేంద్రంలో వైద్య సేవల నిమిత్తం రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కుక్కునూరులో ఎ బ్లాక్‌లో ఒక వైద్య శిబిరం, వేలేరు పాడు పిహెచ్‌సి సమీపంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 28 మంది వైద్యాధికారు లను, సిబ్బందిని నియమిం చామన్నారు. వేలేరుపా డులో 15 మంది, కుక్కునూ రులో 13 మంది ఉన్నార ని తెలిపారు. 16 మందిని డిప్యూటేషన్‌పై వైద్య సేవల కోసం వినియోగి స్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరాల్లో ప్రత్యేక డాక్టర్లను నియమించామని, వీరితో పాటు ఎఎన్ఎం లను, ఆశా వర్కర్లను వినియోగిం చనున్నట్లు చెప్పారు. అవసరమైన అత్యవసరనమైన మందులను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు.

పోలవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు, రిజర్వాయర్లు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం ఉదయం మండలంలో ఎడతెరపిలేకుండా భారీ వర్షం కురిసింది. గుంజవరం, పేద్రాల కాలువలు, కొండవాగుల జలాలు పొంగి గుంజవరం కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్నాయి. ఎల్ఎన్‌డిపేట రిజర్వాయర్‌కి కొండవాగుల జలాలు వచ్చి చేరడంతో రిజర్వాయర్ నిండి ఎల్ఎన్‌డిపేట రిజర్వాయర్ సామర్థ్యం 90.05 టిఎంసిలు కాగా ప్రస్తుతం 88.10 టిఎంసిల నీటిమట్టం నమోదైంది. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం అదే నీటిమట్టాన్ని పరిమితిగా చేస్తూ మూడు స్లూయిజ్ గేట్లకు ఒక్క గేటును పది సెంటీమీటర్లు పైకి ఎత్తి 330 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఎఇ కొండలరావు తెలిపారు. కొండవాగుల జలాలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కొవ్వాడ కాలువల్లోకి వరద జలాలు చేరి పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. గోదావరి నీటిమట్టం కడమ్మ స్లూయిజ్ గేట్లకు సమాంతరంగా ఉండడంతో కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లే వీలులేక పంటపొలాలు నీటమునిగాయి.

పరవళ్లు తొక్కుతున్న డ్రెయిన్లు
ఆందోళనలో రైతన్నలు

ముదినేపల్లి : మండలంలోని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అన్ని మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు పరవళ్లు తొక్కుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు మండలంలోని డ్రెయిన్లలోకి వచ్చి చేరుతుంది. దీంతో మండలంలోని అన్ని డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. పోల్‌రాజు, పెదలంక, అన్నవరం మేజర్ డ్రెయిన్లతో పాటు మైనర్, మీడియం డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించడంతో ఈ డ్రెయిన్ల ఉన్న ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్ల గట్లు పలుచోట్ల బలహీనంగా ఉండడంతో ఎక్కడ గండి పడి చేలు ముంపు బారిన పడతాయోమోనని భయాందోళనలు చెందుతున్నారు. వర్షాలు తగ్గకపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు డ్రెయిన్లలో ప్రవహిస్తుంది. దీనికి తోడు దాదాపు అన్ని డ్రెయిన్లు ఆక్రమణకు గురయ్యాయి. డ్రెయిన్లు డెక్క, తూడుతో దట్టంగా అలుముకుపోయాయి.

గత పాలకుల నిర్లక్ష్యమే ముంపునకు కారణం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - వేలేరుపాడు

వరద బాధితులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అల్లూరి నగర్, మేడేపల్లి, మాదారం, ఉదయ్ నగర్ తదితర గ్రామాల్లోని పెద్ద వాగు ప్రాజెక్ట్ వరద బాధితులను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించి జరిగిన నష్టాన్ని, ప్రభుత్వం నుండి అందుతున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు.



వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న రామకృష్ణ

ప్రభుత్వాల నిర్లక్ష్యమే ముంపుకు కారణం

గత పాలకులు సరైన క్రమంలో ప్రాజెక్టుల మరమ్మతులు చేపట్టినట్టయితే ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాజెక్టుల వల్ల నష్టం జరగకుండా ఉండేదన్నారు. తెలంగాణలో ప్రాజెక్టు ఉండటం ఆయకట్టు అంతా ఆంధ్రాలో ఉండటం వల్ల ఇరు రాష్ట్రాలు సమన్వయంతో ప్రాజెక్టు మరమ్మతులు చేసి ఉంటే ఈ పరిస్థితి నెలకొనేది కాదన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లోని ప్రజల్లో భయానక వాతావరణం నెలకొందన్నారు. భారీ వర్షాల వల్ల ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

వరద బాధితులకు మేడేపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారికి కల్పించిన సౌకర్యాలను చూశారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం అందిస్తున్న తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. నష్ట పోయిన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగే వరకూ భారత కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసాని ఇచ్చారు. పోలవరం నిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వటంతో పాటు, పునరావాసం కల్పించాలన్నారు. అనంతరం పెరుగుతున్న గోదావరి వరదను రుద్రంకోట వెళ్లే రహదారిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు, మండల కార్యదర్శి బాడిస రాము, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్, కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఐత సురేష్, పిట్ట వీరయ్య, వరక శ్యామల, పాపారావు, అర్జున్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పొలాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చోట్ల నాటిన వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. నారుమడులు నీట మునగడంతో నారు కుళ్లిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న పంటల గురించి మండల వ్యవసాయ శాఖ అధికారి కె.గంగాధర్‌ను వివరణ కోరగా ములగలంపల్లి ఏరియాలో 23 ఎకరాలు, పి.రాజవరం ఏరియాలో 30 ఎకరాల్లో వరి పంట స్వల్పంగా దెబ్బతినట్లు తెలిపారు. రాచన్నగూడెం ఏరియాలో 40 ఎకరాలు, అంకన్నగూడెం ఏరియాలో 42 ఎకరాల్లో పత్తి పంటలు దెబ్బతిన్నట్లు ఆయన తెలిపారు. వరి రైతులు నారు మడుల్లో నీరు ఉన్నట్లయితే నీటిని బయటకు తీసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

అధికారులకు నష్టం నివేదిక

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో వర్షానికి 380 ఎకరాల్లో వరి నాట్లు నష్టం వాటిలినట్లు చింతలపూడి మండల అగ్రికల్చర్ ఎఒ మీనాకుమారి తెలిపారు. నష్టం అంచనా వేసి వివరాలు జిల్లా అధికారులకు నివేదిక అందించినట్లు తెలిపారు.

వరి పొలాల్లో నీటిని బయటకు తోడాలి

ప్రజాశక్తి - మండవల్లి

అధిక వర్షాల వల్ల వరి పొలాల్లోకి చేరుకున్న నీటిని బయటకు తోడేలా రైతులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎఒ షేక్ జరీనా తెలిపారు. మండలంలోని కానుకొల్లు రైతు సేవా కేంద్రంలోని నీట మునిగిన వరి పొలాలను ఆమె ఆదివారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలకు వరి పొలాల్లోకి అధికంగా నీరు చేరుతుందన్నారు. పొలాల్లోకి చేరుకున్న నీటిని ఇంజన్ల సాయంతో బయటకు తోడాలన్నారు. లేకపోతే వరి నారు పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. నీటిని బయటకు తోడేసిన తర్వాత 20 కేజీల యూరియా, పది కిలోల పొటాష్ ఎరువును బూస్టర్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎలు, విఆర్ఎ, రైతులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న ఎఒ షేక్ జరీనా

ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పోలవరం

ఆదివాసీ మహాసభ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆదివాసీ మహాసభ కార్యదర్శి మూలెం రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువుకుంటూ పార్ట్ టైం ఉద్యోగాల కోసం ప్రయత్నించే వారు, పదో తరగతి విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.17 వేల జీతం, పిఎఫ్ రూ.300 అదనంగా ఇవ్వడంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు గుంటూరు జిల్లా దాచేపల్లి ఏరియాలో సిమెంటు కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా పని చేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 8500572538 సంప్రదించాలని తెలిపారు.

టార్పాలిన్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డులోని సోమవరప్పాడులో రోడ్డు పక్కన గుడారాలు వేసుకుని జీవించే పది కుటుంబాలకు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి ఆదేశాలతో రెడ్ క్రాస్ వాలంటీర్లు టార్పలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వాలంటీర్లు మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా రోడ్డు పక్కన నివసించే సంచార కుటుంబాలు పిల్లలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ఛైర్మన్ కృష్ణారెడ్డి వారికి టార్పాలిన్లను పంపిణీ చేయమన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్లు ఎ.సూర్యనారాయణ, వి.నాగరాజు, కె.శ్రీనివాస్, ఆరేపల్లి వెంకట శ్రీనివాస్, సాయి ప్రవీణ్ పాల్గొన్నారు.



టార్పాలిన్లు అందిస్తున్న రెడ్‌క్రాస్ వాలంటీర్లు

గురువుకు పూర్వ విద్యార్థుల సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

గురు పౌర్ణమి సందర్భంగా కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా పనిచేసి రిటైర్ ఐన జటావల్లభుల జగన్నాథం మాస్టారును ఆనాటి పూర్వ విద్యార్థులు ఆదివారం సత్కరించారు. ఉంగుటూరు మండలం కైకరంలో జగన్నాథం ఇంటి వద్ద పూర్వ విద్యార్థులు కోనా శ్రీనివాసరావు, వెజ్జు సుబ్బారావు, అద్దేపల్లి శేషయ్య, కొచ్చర్లకోట శ్రీనివాసరావు మిత్రబృందం గురువుని సత్కరించి పండ్లు, నూతన వస్త్రాలను బహుకరించారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయని, అక్రమ కట్టడాలు తొలగించటానికి సిబ్బంది లేరని ఆర్అండ్‌బి మండల ఎఇ సుందరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారుల్లో రోజురోజుకు అక్రమ కట్టడాలు పెరిగిపోతూనే ఉన్నాయన్నారు. ఈ ఆక్రమణలు తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. చింతలపూడి కొత్త బస్టాండ్ దగ్గర నుంచి చింతలపూడి కోర్టు, ఫాతిమాపురం వరకు ఉన్న ఆక్రమణలు రోడ్డుకు ఇరువైపుల్లో ఉన్న వాటిని తొలగించాలన్నారు. సాయిబాబా ఆలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు చింతలపూడి టౌన్ పరిధిలో మూడు కిలోమీటర్లు రోడ్లు పరిస్థితి అధ్వానంగా ఉందని, ఈ మూడు కిలోమీటర్లు రోడ్లలో సరైన డ్రెయినేజీ లేవన్నారు. దీంతో వర్షపు నీరు రోడ్లమీద నిలిచి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయన్నారు.

'కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటా'

ప్రజాశక్తి - చింతలపూడి

కార్యకర్తలే టిడిపికి బలమని, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని పార్టీ సీనియర్ నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. ముత్తారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలంలోని టిడిపి ప్రగడవరం గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు, నాయకులు ఆదివారం కలిసి పరామర్శించారు. ముత్తారెడ్డి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని హైదరాబాద్‌లో వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. పరామర్శించినవారిలో సుధీర్ రెడ్డి, శ్రీనివాసరావురెడ్డి, మానేపల్లి రాజారావు, కొమ్ము తిరుపతిరావు, మహాలక్ష్ముడు, వీరాస్వామి పాల్గొన్నారు.

జనసేన ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు అందజేత

ప్రజాశక్తి - వేలేరుపాడు

గతేడాది వేలేరుపాడు గ్రామానికి చెందిన ఏపురి కృపా అనే వ్యక్తి భూదేవిపేట గ్రామం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి జనసేన పార్టీ తరపున సభ్యత్వం ఉండటంతో ఆదివారం అతని కుటుంబ సభ్యులకు మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు రూ.ఐదు లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా అతని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అసలు కృపా అనే వ్యక్తి ఇలా సభ్యత్వం తీసుకున్న విషయం తమకు తెలియదని, వేలేరుపాడు జనసేన మండలాధ్యక్షులు గణేషుల ఆదినారాయణ రూ.500 కట్టారని, ఈ రోజున కృపాకు జనసేన ఇన్సూరెన్స్ రూ.ఐదు లక్షలు రావడానికి ప్రధాన కారణం ఆదినారాయణ అని వారికి జీవితాంతం రుణ పడి ఉంటామని తెలిపారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు గణేషుల ఆదినారాయణ పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు.. ప్రజల అవస్థలు

గోతుల్లో నిలుస్తున్న వర్షపు నీరు
ప్రమాదాల బారిన వాహనదారులు



అధ్వానంగా ముక్కంపాడు గ్రామం రోడ్డు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చింతలపూడి పెద్ద బస్టాండ్, రత్న థియేటర్ ఎదురుగా ఉన్న రోడ్డు మరింత ప్రమాదకరంగా తయారైంది. ప్రతిరోజు ఆ గుంతలో ఏదో వాహనం ఇరుక్కుపోతూనే ఉంటుంది. జెసిబి సహాయంతో ఆ వాహనాన్ని లాగడం పరిపాటిగా మారిపోయింది. అయినా అధికారులు పట్టించుకోవడంలేదని, కనీసం గుంతలు కూడా పూడ్చడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని, గోతులను పూడ్చాలని చింతలపూడి పంచాయతీ ప్రజలు అధికారులను, పాలకులను వేడుకుంటున్నారు.



రత్న థియేటర్ వద్ద గోతిలో దిగబడిన లారీని లాగుతున్న జెసిబి

40 ఏళ్ల నుంచి ముక్కంపాడుకు రోడ్డే వేయలేదు..!

సుమారు 40 ఏళ్ల నుంచి ముక్కంపాడు గ్రామానికి రోడ్డు లేదని, రోడ్లు వేయాలని ఆ గ్రామస్తులు అధికారులను, నాయకులను కోరుతున్నారు. గత 40 ఏళ్ల నుంచి రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నామని, వర్షాకాలం వస్తే నడించేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు వంద ఇళ్లు ఉన్నాయి. 500 వరకు జనాభా ఉన్నారు. అందరూ ఎస్‌సి సామజిక తరగతికి చెందినవారు ఉన్నారు. రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోతున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకూ ఇబ్బందులు తప్పడంలేదన్నారు. మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అధికంగా కురిస్తే ప్రగడవరం- ముక్కంపాడు గ్రామానికి రాకపోకలకు నానా అవస్థలు పడాల్సి వస్తుందని, మోకాలి లోతు వరకు వరద నీరు వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులకు, పాలకులకు పలుమార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, టిడిపి నాయకులు స్పందించి రోడ్డు వేయాలని ముక్కంపాడు గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వరద బాధితులను అన్నివిధాలా అదుకుంటాం

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీ మహేష్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు

వేలేరుపాడు మండలం కుమ్మరిగూడెంలో పెదవాగు ప్రాజెక్టు వల్ల ముంపునకు గురై పునరావాస కేంద్రాల్లో ఉంటున్నవారిని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఆదివారం పరామర్శించారు. వారికి శిబిరాల్లో అందుతున్న వైద్య సేవలను, బాధితులకు అందుతున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు పెదవాగు ప్రాజెక్ట్ గట్టు తెగి ముంపునకు గురైన బాధితులకు మెరక ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తామన్నారు. ముంపునకు గురైన ఏడు పంచాయతీల్లోని 12 గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు రాకుండా బ్లీచింగ్ చల్లి, దోమ తెరలను, మందులను అదించాలని గ్రామ పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఢిల్లీ నుంచి ఫోన్ చేయగానే తక్షణం స్పందించి ఎటువంటి ప్రాణాపాయం జరగకుండా చర్యలు చేపట్టిన ఏలూరు జిల్లా అధికారులను, పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు. వరదల్లో చిక్కుకున్న వారి ప్రాణాలను హెలికాప్టర్ సహాయంతో కాపాడిన విపత్తు నిర్వహణ శాఖ వారిని ప్రశంశించారు. ఎంపీ మహేష్‌కుమార్ ఆర్థిక సాయంతో నిత్యావసర వస్తువులను స్థానికులకు అందించారు. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని చెప్పారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. జ్వరాలు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య బృందం కూడా అప్రమత్తంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీను, మాజీ ఎంఎల్ఎ మురళీకృష్ణ పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులను అందిస్తున్న ఎంపీ మహేష్

రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తంగెళ్లమూడి, కోమడవోలు ఆయకట్టు పరిధిలో భారీ వర్షాలకు ముంపునకు గురైన వరి పంట పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ఆదివారం పరిశీలించారు. మురుగు డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికను పరిశీలించి, పంట నష్టం వివరాలను రైతులను, కౌలు రైతులను, దేవాలయ కౌలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ముంపు వల్ల వేసిన నాట్లు కుళ్లిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ భారీ వర్షాలకు పంటలు ముంపునకు గురై జిల్లాలో వేలాది ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాలువలు, మురుగు డ్రెయిన్లు బాగు చేసి ఆధునీకరించకపోవడం వల్ల పంట నష్టాలకు కారణంగా ఉందని చెప్పారు. ఏలూరు నగరం చుట్టూ పంట పొలాలకు అనుకుని ఉన్న మురుగు డ్రెయిన్లలో అనేక ఏళ్లుగా పూడిక తీయకపోవడం, ఆక్రమణలకు గురి కావడంతో మురుగు కిందకు వెళ్లే మార్గం లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని చెప్పారు. జిల్లాలో రైతులకు ఉపయోగపడే పద్ధతుల్లో డెల్టా ఆధునీకరణ పనులు జరగాలని కోరారు. ఎకరాకు రూ.12 వేల నుంచి రూ.15 వేలు పెట్టుబడి పెట్టి నాట్లు వేశారన్నారు. వేసిన పంట కుళ్లిపోతే మళ్లీ వరినారు దొరికే పరిస్థితి లేదన్నారు. ఇతర ప్రాంతాల నుండి వరినారు తీసుకొచ్చి అన్నదాతలకు అందించాలని కోరారు. పంట నష్టాలు నమోదు చేసి ఎకరాకు రూ.15 వేలు నష్టపరిహారం చెల్లించి కౌలు రైతులను, పేద రైతులను, దేవాలయ కౌలు రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి పంట నష్టాల సమస్యలను తీసుకువెళ్తామని, వినతిపత్రం అందిస్తామని చెప్పారు. నష్టపోయిన అన్నదాతలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు గొర్రెల సాంబశివరావు, లావేటి శ్రీనివాసరావు, మొగిలి భాస్కరరావు, వినుకొండ నాగేశ్వరరావు, గేదెల రాఘవరాజు పాల్గొన్నారు

ఏలూరులో ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా కేంద్రమైన ఏలూరులో వంద పడకలతో ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేష్ డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకొచ్చిన బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన విధానాలను త్వరితగతిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఏలూరు స్ఫూర్తి భవనంలో సంఘం ఏలూరు జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబులేష్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కార్మిక కోడ్‌లుగా మార్చి కార్మికులకు నష్టం వాటిల్లే విధానాలకు ప్రయత్నిస్తుందని ఆయన విమర్శించారు. కార్మిక చట్టాల పరిరక్షణకు ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్ కార్యక్రమానికి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, ఆ కార్యక్రమంలో ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాలు అగ్ర భాగాన ఉండాలని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, ప్రయివేటీకరణ విధానాలపై రానున్న రోజుల్లో పోరాటాలను విస్తృత పరిచేందుకు సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మూడు రోజులపాటు విశాఖ నగరంలో ఎఐటియుసి జాతీయ సమ్మేళనం జరుగుతుందని ఆయన తెలిపారు. సమ్మేళనం ప్రారంభం రోజున వేలాదిమంది ఉద్యోగ కార్మికులతో విశాఖ నగరంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు, జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా నాయకులు సిహెచ్.పుల్లారావు పాల్గొన్నారు.

వరద ముంపు తీవ్రత తగ్గేలా చర్యలు

ముంపు పొలాలను పరిశీలించిన ఎంఎల్ఎ ధర్మరాజు



ముంపు పొలాలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

వర్షాకాలంలో వాగులు, పంట, సాగునీటి, మురుగు కాలువల వల్ల పంట పొలాలు ముంపు బారిన పడకుండా ఎక్కడికక్కడ డ్రెయినేజీలను ప్రక్షాళన చేసే విధంగా కార్యాచరణ రూపొందించేందుకు కృషి చేస్తానని ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు, భీమడోలు మండలాల్లో ముంపు పొలాలను ఆదివారం అధికారులతో కలసి పరిశీలించారు. నియోజకవర్గంలో దాదాపు తొమ్మిది వేల ఎకరాలకు పైగా వరి పొలాలు నీట మునిగాయని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారన్నారు. నష్టపోయన రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకునేలా తన వంతు కృషి చేస్తానన్నారు. భీమడోలు ఎడిఎ ఉషారాజకుమారి, ఎఒ బాలిన వెంకటేష్, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు, టిడిపి, జనసేన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నిడమర్రు :మండలంలోని భువనపల్లి, అడవికొలను, ఎనికెపల్లి గ్రామాల్లో అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన పంట పొలాలను ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను, బాధితులను ఎంఎల్ఎ పరామర్శించారు. అధైర్య పడవద్దనిప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు/వేలేరుపాడు

భారీ వర్షాలు, వరదల కారణంగా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తాగునీటి అవసరాలకు ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఇటీవల ఫ్లడ్ ప్రభావితమైన 12 గ్రామాల్లో గత మూడు రోజులుగా రెండు లక్షల వాటర్ ప్యాకెట్లను పంపిణీ చేశామని, అలాగే ఎనిమిది ట్యాంకుల ద్వారా రోజుకు 18 ట్రిప్పులు నీరు సరఫరా చేశామని తెలిపారు. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని మరో 14 నివాసిత ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయడంతో పాటు వేలేరుపాడు శివకాశీపురంలోని ఎస్‌టి బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 50 వేల వాటర్ ప్యాకెట్స్‌తో పాటు ఇతర నిత్యావసర వస్తువులు సిద్ధం చేశామన్నారు. కుక్కునూరు మండలం దాచారం ఆర్అండ్ఆర్ కాలనీ పునరావాస కేంద్రంలో ఇప్పటికే ఐదు బోర్లు పంపింగ్ చేశామని, ఒక మోటారును కూడా ఏర్పాటు చేశామని, ఇక్కడ పునరావాస కేంద్రంలో 13 టెంపరరీ మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

బ్రిడ్జి వద్ద రోడ్డుకు గండి పడే అవకాశం


ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామానికి చింతలపూడి మండలం శివాపురం గ్రామానికి మధ్యన బ్రిడ్జి ఉంది. ఖమ్మం జిల్లా బేతుపల్లి చెరువు నుంచి వరద నీరు ఈ బ్రిడ్జి కింద నుంచి తమ్మిలేరు రిజర్వాయర్‌కు చేరుతుంది. బ్రిడ్జి నిర్మాణం సరిగా లేకపోవడంతో వరద ఉధృతికి అనేకసార్లు బ్రిడ్జి పక్క నుంచి రోడ్డును కోసి వేస్తూ వరద నీరు ప్రవహిస్తూ ఉంది. ఈ సందర్భాల్లో ప్రజలు, రైతులు, ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. అనేకసార్లు బ్రిడ్జి పక్కన ఉన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసిన ప్రయోజనం లేకుండా పోతుంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరద ఉధృతి ఎక్కువగా వచ్చింది. బ్రిడ్జి పక్కన ఉన్న రోడ్డుకు గండి పడటంతో తాత్కాలికంగా సిమెంట్, ఇసుక బస్తాలు వేసి రోడ్డును సరిచేసి గండిని పూడ్చారు. వరద ఉధృతికి తాత్కాలిక మరమ్మతులు చేసిన రోడ్డుకు మళ్లీ గండి పడే అవకాశం ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శాశ్వత బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి ప్రాంతం

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న శంకరరావు

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్‌బి.శంకరరావు సూచించారు. స్థానిక పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన తొమ్మిది మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థి సైంటిస్ట్ జి.సురేష్‌బాబు తన తల్లిదండ్రుల పేరిట మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిన టి.జగన్నాథంకు గోల్డ్ మెడల్ బహుకరించి సన్మానించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు దొమ్మేటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డిఎస్‌బి.శంకరరావు రూ.12 వేల నగదు, మెమెంటోలతో సన్మానించారు. గ్రామ పెద్ద జి.శ్రీరామమూర్తి నగదు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపల్స్ ఎన్.రాంబాబు, నరేష్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఉప్పులూరి ప్రసాద్‌బాబు, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, షరీన్, ఎం.లక్ష్మణరావు, బివి.రమణ, కె.నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రౌడీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంచాలని ఎస్‌పి శివప్రతాప్‌కిషోర్ ఏలూరు జిల్లా సిబ్బందికి సూచించారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం, సబ్ డివిజన్ పరిధిలో పోలీసు సిబ్బంది ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని తెలిపారు. వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెంచామన్నారు. ప్రవర్తనలో మార్పు రాకపోయినా, మళ్లీ తిరిగి అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాలతో వారిపై ఉన్న షీట్లు ఎత్తివేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్యవైశ్య సంఘం నూజివీడు మండల అధ్యక్షులుగా చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శిగా మానేపల్లి సతీష్, కోశాధికారిగా తటవర్తి కుమార వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఆంధ్ర ప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఇసి మెంబర్ దోసపాటి రాము, ఆర్యవైశ్య ప్రముఖ నాయకులు మాటూరి ప్రసాద్, వాసవి క్లబ్ నూజివీడు ప్రెసిడెంట్ వనమా వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో హెచ్ఆర్ పాలసీ అమలు, సిబ్బంది జీతాలు చెల్లింపుపై ఆంక్షలు విధిస్తూ జిల్లా సహకార శాఖాధికారి జారీ చేసిన ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి పిఎసిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రఘురాం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ఐదేళ్లగా పిఎసిఎస్‌లో విధులు నిర్వహిస్తూ జీతాలు పొందుతుంటే పట్టించుకోని అధికారులు, ఇప్పుడు అర్ధాంతరంగా సిబ్బంది జీతాలు నిలిపివేయాలని, లేకుంటే సొసైటీలదే పూర్తి బాధ్యత అని ఉత్తర్వులు జారీ చేయటం దారుణమన్నారు. అనధికారక నియామకాలు జరిగితే అప్పటినుంచే ఎందుకు కమిటీలపై చర్యలు తీసుకోలేదన్నారు. డిసిఒ తన ఉత్తర్వులు ఉపసంహరించకపోతే ఈ నెల 30వ తేదీన ఏలూరు జిల్లా డిసిఒ కార్యాలయం ఎదుట అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని రఘురాం హెచ్చరించారు.